# పిరికిమందు

శ్రీ నేమాన సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

"బూచివాని పిలువనంపనా? గోపాలకృష్ణ... .. ..........
బూచివచ్చెననుచు నెంత నూచినాను నిదురబోవు..........."

అని:—

"అల్లదుగో బూచివాడు వస్తాడు నాతండ్రీ పవళింపరా..........."

అని పాడుతూ ఉగ్గూపాలుపోసి ఉయ్యాలలో పడుకోబెట్టి, ఊచుతూ నిద్రబుచ్చుతారు పిల్లలని తల్లులు; అంటే అప్పటినుండి పిల్లలమనస్సులకి అధైర్యభావాన్ని అంటిస్తున్నా రన్నమాట—ఆపిల్లలు కొంచెం పెద్దవారై, వారంతట వారు వాకట్లో ఆడుకొనేవయస్సులో వారిని భయపెట్టడం చాలా రకాలున్నాయి; అందులో ముఖ్యమైనది బూచాడువచ్చి నిన్నెత్తుకపోతాడన్నదే; - "బూచాడు అనేవాడు లేడు, ఊరికనే అమ్మ అంటూంది" అనే జ్ఞానం పిల్లలకి కలిగినతరువాత, - పిల్లలకంటికి కొంచెం భీకరంగానున్న వ్యక్తిని వాళ్లకు చూపించి "ఒరేయి అబ్బాయీ, ఇదిగో ఈయన్నిచూశావా! ఈసారిగాని నువ్వు అల్లరిచేస్తే ఇకను నిన్నెత్తుకుపోతారు" - అని చెప్తూ ఆవ్యక్తితో "ఏమండీ, ఈ సారి మావాడు అల్లరిచేస్తే తప్పకుండా ఎత్తుకుపోండీ!" - అనికూడా చెప్తారు. దానికావ్యక్తి "ఓ తప్పకుండాను ఈసారి అల్లరిచేసినా, ఏడ్చినా, చెప్పినమాట వినకపోయినా అమాంతంగావచ్చి ఎత్తుకుపోతాను" అంటాడు. - ఈ మాటలన్నీ వింటూన్న శిశువు బిక్కమొఖంపెట్టి తల్లిఒడిలో దూరిపోతాడు.

శిశువు అల్లరిచేసి ఏడుస్తున్నప్పుడు ఈ "బూచివాడు" అనే ఆయుధం వానిమీద ప్రయోగిస్తే తాత్కాలికంగా కొంత లాభమున్నా ముందు ముందు అదిచాలా విషమిస్తుంది. ఏమంటే అవసరంవచ్చి పొరుగునున్నవారింట పుస్తకం తీసుకురమ్మంటే "అబ్బో! దార్లో బూచాడున్నాడు నాకు భయమేస్తుంది" అని కొట్టిపారేస్తారు పెద్దవాళ్లమాట. ఇందుకు మూలకారణం స్వయం కృతాపరాధమే. - దీనికి ఉదాహరణగా ఒకసంగతి చెప్తాను: - మాభారతికి మాపొరుగునఉన్న తురకల అబ్బాయి 'నన్నా' అంటే అపరిమితమైన భయం. ఏమాత్రమైనా అల్లరిచేసిందా అంటే "అదుగో నన్నా ఒస్తూన్నాడు" అంటే సరి పెరట్లోకి పారిపోతుంది. ఇందుకు మూలకారణం మేమే. !!

ఆ వేళ మాయింట ఏదో పండుగ. నలుగురు నాలుగుపనులలోను ఉన్నారు. మాభారతికూడా లక్కపిడతలు, గాజుబొమ్మలు పెట్టుకొని ఆడుకొంటూంది. అయినా దానితో మాఅమ్మ "పక్కింటివారు మన పప్పుగిన్ని పట్టికెళ్లారు త్వరగా అడిగి తీసుకురాఅమ్మా" అని చెప్పింది. - దానికది మొఖం ప్రక్కకి తిప్పుకొని "అబ్బో దార్లో నన్నా ఉన్నాడు, నేనువెళ్లను" అనేసింది. - పప్పుగిన్ని అవసరం, తెచ్చి పెట్టేవారు ఇంకెవరూలేరు. ఇదివెళ్లనని నిర్మొహమాటంగా చెప్పేసింది. - మాఅమ్మకి చెప్పలేనంతకోపం వచ్చేసింది. కోపంవచ్చినా చేసేదేముంది? మొదటనే భయపెట్టిందిగా నన్నాను చూపెట్టి - "నన్నా లేడు వెళ్లమ్మా" అని ఎంతచెప్పి బతిమాలినా వినదు, వెళ్లదు, నన్నా మింగేస్తాడన్న భయమే.

ఇంతకూ చెప్పే దేమిటంటే మొదట పిల్లలని భయంపెట్టే వచ్చునుగాని, ఆమర్నాడు మనమే బాధపడవలసి వస్తుంది. - అప్పటి మనబాధ అటుంచినా ఆపిల్లలే వారి భావిజీవితంలో చాలా బాధపడి పోతారు. - మొగపిల్లవాడైతే పెరిగి పెద్దవాడైనతరవాత నలుగురు పెద్దమనుష్యులని చూచి మాటాడి కార్య

సాధన చేసుకొని రావలసినవాడా? అటువంటివాడికి చిన్నప్పటినుంచి తల్లిదండ్రులు నూరిపోసిన పిరికి మందువల్ల కొత్తవాళ్లని చూచి భయపడ్డం అలవాటై పోతుంది. - అంచేత కొత్తవాళ్లముందు వాడికి నోటే లేవదు. - ఇకను వాడేం వ్యవహారవేత్తయి దేశాన్ని ఉద్ధరిస్తాడు.?

అన్నట్టు చెప్పమరచేను, దెయ్యాలని పిల్లలని భయపెట్టడం ఒక తరహా. బూచివాడికి అపరిచిత వ్యక్తికి భయపడని వయస్సులో ఈ దెయ్యాలనిచెప్పి భయపెడతారు. - దెయ్యాలంటే పిల్లలకే కాకుండా పెద్దవాళ్లకుకూడా మనలో చాలామందికి భయం. మనకేకాకుండా మతాంతరులక్కూడాను. - ఇందుకు కారణం కొంతవరకూ చిన్నప్పుడు పెద్దవాళ్లచేత భయపెట్టబడడమే. - అందుకే చాలామంది పిల్లలతండ్రులే పెళ్లాలని సాయంతీసుకొని రాత్రిళ్లు బయటికొస్తారు.

దేశంయొక్క భావి భాగ్యోదయానికి కారణభూతులైన శిశువుల హృదయాలలో ధైర్యం, సాహసం, కార్యదీక్ష, మొదలైనవన్నీ మొలకలెత్తించాలి. తల్లి దండ్రులదగ్గర పెద్దవారిదగ్గర పిల్లలకి భయం ఉండవచ్చు తప్పకుండా ఉండాలి కూడాను. కాని, వారి భావి జీవితాన్నంతా వ్యర్థపరచే ఇటువంటి పిరికిమందును మాత్రం పోయకూడదు. చిన్నతనంలోనే పిల్లలకి పెద్దవారిచేత బోధింపబడ్డ ఎటువంటి మహత్తర విషయాలైనా అచంచలంగా వారి కోమలహృదయాలలో హత్తుకు పోతాయి. ఆ శరీరాలు పోయినా వారి వీర్యముల్లో ఈ గుణాలు సహజములై పోతాయి.

అంచేత పిల్లలని భయపెట్టి నిర్వీర్యులుగాచేసి తద్వారా దేశానికి ద్రోహంచెయ్యవద్దని భావి భారతవీరుల్ని తయారుచేసే ప్రతి తల్లి దండ్రిని ప్రార్థిస్తున్నాను.

శాంతిః

